


తిరుగు ప్రయాణం ఆరంభమయి అప్పుడే గంట దాటింది. నాకు బస్సంతా నిశ్శబ్దాన్ని మోసుకొంటూ ముందుకు వెడుతున్నట్లుగా ఉంది. పకపకల్నీ నవ్వుల్నీ అన్నిటినీ అక్కడ ఆ వాఘిరాతీరంలోనే వదిలిపెట్టి వచ్చినట్లుంది.

వెళ్తున్నపుడు ఎంత గోల చేశామని.... తల్చుకొంటేనే చాలు, ఆ హుషారుతో మళ్ళీ మరొక్కసారి లేచి బస్సు మధ్యలో నాలుగు సీట్ల నడుమ నృత్యం చేద్దామనిపిస్తోంది. అంతగోల, గగ్గోలు, సందడి... అంతా ఇప్పుడేదీ?

.... అజంతా, ఎల్లోరాలకు ట్రిప్ వేద్దామని రాఘవరావు అన్నప్పుడే నాకెంతో సంతోషం వేసింది. ఎవరో అన్నట్లు మనిషికి రవ్వంత కలాపోసన ఉండాలిగదా! నాలో అది కొంచెం ఎక్కువే! నాలుగు రోజులు సెలవు దొరికితే బేలూరు, హళేబీడుకో, రెండురోజులు సెలవు దొరికితే, ఏ శ్రీశైలానికో... ఆఖరికి ఒక్కరోజు మాత్రమే ఆఫీసుకు ఆటవిడుపు అయితే ఏ నాగార్జున సాగరానికో వెళ్ళిరావడం పనిగా పెట్టుకొన్న మనిషిని! యాంత్రికమైన జీవితంలోంచి కొంచెం బయటపడేందుకు చేసే చిరు ప్రయత్నమది. నా పూర్వీకులు నాకు అందించిన మహావారసత్వాన్ని అప్పుడప్పుడు జ్ఞప్తి తెచ్చుకొనేందుకు కావించే యజ్ఞమది.

మనిషికి ఎన్నెన్నో వరాలిచ్చి, తాను అజ్ఞాతంగా ఉండిపోయిన ప్రకృతి మాత ఒడిలోకి చేరి, ఆ తల్లి కనిపించకపోయినా ఆ తల్లి పాడే కమనీయ గీతాన్ని పచ్చని చెట్ల మధ్య ఆకులాకుల్లో, రెమ్మ రెమ్మల్లో విని తరించిపోవాలని చేస్తున్న బృహత్ స్వార్థపథకం అది!!

అందుకే 'అజంతా' అనగానే అవునన్నాను. ఎల్లోరా అనగానే యస్ అన్నాను. నాకు తగ్గదే గాయత్రికూడానూ!

ఆ మాట క్లబ్‌లో అనుకొన్న రోజునుంచీ, బయలుదేరే క్షణంవరకూ అందరూ అదే విషయం గురించి మాట్లాడుకొనే వాళ్ళం. మా అందరికన్నా శేఖర్ ముందే అక్కడికి వెళ్లి అక్కడ మా ఏర్పాట్లు గురించి తగిన జాగ్రత్తలు తీసుకొనివచ్చాడు.

ఏ పరిస్థితిలోనూ ఇది విఫలం కాకూడని విహార యాత్ర అయితీరాలి. అనుకున్నాం! అజంతా గురించి అన్ని వివరాలూ సేకరించాం. పురావస్తుశాఖవారు ప్రచురించిన పుస్తకాలు తెప్పించాం. రొటేషన్ పద్ధతిలో అందరికి అవి చదివే అవకాశం ఇచ్చాం.

ఇంత ప్రయత్నం చేస్తే తప్ప మా ఆశయం ఫలించదని నాకు తెలుసు!

లేకపోతే ఎక్కడో కొండ నడుమ, అర్ధ చంద్రాకారపు గుహల్లో ఉన్న ఆ బుద్ధ భగవానుని తత్వం అర్థంచేసుకోవటం సులభమా చెప్పండి!!

బస్సు బయలుదేరిన గంటకు మేం నగరం పొలిమేరలు దాటాం. అప్పుడు మొదటిసారి మా బస్సు పంచరయింది!! అందరం ఒక్కసారి గోలపెట్టేశాం. 'పచ్చని వెన్నెల్లో పదినిమిషాలు గడిపిరండిసార్! టైర్ మార్చేస్తాం8 అంటూ హామీ ఇచ్చాడు డ్రైవరు.

సరే చేసేదేముందీ, ప్రకృతి ఆరాధన ఇక్కడినుంచే ప్రారంభిద్దాం అని అందరం దిగాం. చేసే పనేమీ లేక, తెచ్చుకున్న నవకాయ పిండివంటల్ని తొలిసారి టేస్ట్ చేద్దామని ఆరంభించి, సగానికి సగం లాగించేశాం! ఆ తర్వాత ఆ వెన్నెలమ్మ ఒడిలో రాజు బ్రేక్‌డాన్స్ చేస్తే మేమంతా చప్పట్లు కొట్టాం. సరోజ 'మనసున మల్లెల మాలలూగెనే' అంటే మూడు రోజులవరకు ఏ పప్పులూ ఉడకపోవ్ అంటూ సరోజ భర్త శేఖరాన్ని ఆటపట్టించాం! పేరుకు ఇషాక్ అయినా, అద్భుతమైన కంఠస్వరంతో పాండవోద్యోగ విజయాల్లోంచి పద్యాలు పాడితే

పరవశించిపోయాం. వెధవది, టైరు పంచరయితేనేం. మన ఉత్సాహానికి పంచర్‌పడే ప్రసక్తే లేదని మమ్మల్ని మేం మెచ్చుకొన్నాం.

ఆ తర్వాత అజంతా వరకు అంతా సాఫీగానే జరుగుతుందనుకొన్నాంగానీ... ఔరంగాబాద్‌లో దిగగానే బాంబులాంటివార్త వినపడిందిమాకు!


"అజంతాలో మీకు హోటళ్ళేవీ లేవు సార్! ఉన్న హోటళ్ళలో వర్కర్స్ సమ్మె చేస్తున్నారు. అక్కడ వాఘిరాలో నీళ్ళుతప్ప మరేమీ దొరకవు మీకు. అన్నీ ఇక్కడనుంచే తీసుకెళ్ళాలి!" అని చెప్పేశారు టూరిజం వాళ్ళు.

'చేసేదేముంది, అలాగే కానివ్వండి!' అనుకున్నాం.

ఔరంగాబాద్‌లోనే ఓ హోటల్‌కు ఆర్డరచ్చాం. ముందురోజే చెప్పాం గాబట్టి, బస్సు బయలుదేరే సమయానికి అన్నీ సిద్ధం!!

ఎదురుగా కళ్ళముందు అవలోకితేశ్వరుడు, పద్మపాణి విగ్రహాలు కనిపిస్తోంటే మనోవేగంతో అజంతా ముందుదిగాం.

ఒకటో గుహ, రెండో గుహ...లు వరసగా ఒకదాని తర్వాత ఒకటిగా చూస్తూ కదిలాం. ఏనాడు. ఏ మహామహులు చిత్రించిన అద్భుత కుడ్య చిత్రాలో అవి.. ఇంకా పదిలమై ఉన్నాయి. చెప్పదలిచిన సత్యాలను, మనిషి అశాశ్వతం అయినా, అతని చర్యలు మాత్రం శాశ్వతం అని చెప్తూనే ఉన్నాయి.



జరాదు:ఖాలనుంచి మనిషిని కాపాడేందుకు బుద్ధభగవానుడెంత ప్రయత్నించినా ఇంకా ఈ లోకంలో దు:ఖం మిగిలే ఉంది, అది ఎందుకో ఆలోచించావా? అన్నట్లు ఆ చిత్రాలన్నీ ప్రశ్నిస్తున్నాయి.

చూస్తున్న కళ్ళకు, చూపుండే మనసుకు ఆ ప్రశ్నలు అర్థమవుతాయి.

ఒక్కో విగ్రహమూ చూస్తూ, ఒక్కో చిత్రాన్ని పరిశీలిస్తూ, అందరికీ నాకు తెలిసిన భాష్యం చెప్తూ వచ్చాను. విన్న వాళ్ళు వింటున్నారు, లేనివారు లేదు. కొందరు నా ముందే నిలబడి, వాళ్ళ ఇంటి విషయాలు చర్చించుకొంటున్నారు. ఇంకొందరు

దేశరాజకీయాలు మాట్లాడు కొంటున్నారు. మరికొందరు దూరంగా నిలబడి, దగ్గరలోనే ఉన్నట్లు కనిపిస్తున్న వాఘిరా నదిలోకి రాళ్ళేస్తున్నారు.

అందరం కలిసికట్టుగా తిరిగి బతికే ప్రపంచమే అయినా, ఎవరి తీరు వారిది!!

అన్ని గుహలూ తిరిగి తిరిగి వెనక్కు వచ్చేస్తోంటే, అంతవరకూ దాదాపు ఏమీ మాట్లాడని గాయత్రి ఒక్కప్రశ్న వేసింది 'అసలు ఈ గుహలన్నీ ఇంత దూరంలో ఎందుకున్నాయో ఆలోచించారా' అని! 'ఇక్కడ కొండలున్నాయి. కనుక గుహలు ఇక్కడే ఉన్నాయి! మనం ఉండేచోటుకు గుహలు రాలేవు గాబట్టి మనమే, అవి ఉన్న చోటుకు రావాల్సి ఉంటుంది గదా' అని సమాధానం ఇచ్చాను. గాయత్రి ఆడది. పైగా నా భార్య! దానికి తెలివితేటలు ఏముంటాయా అన్న సహజ పురుషాహంకారంతో ఇచ్చిన జవాబే అది!

"ఆ రోజుల్లో జనం ఇక్కడే ఉండేవారు కాబోలు!" ఇంకొకళ్లెవరో అన్నారు.

ఆ తర్వాత ఎందరెందరో ఏవేవో జవాబులు చెప్పారు. గాయత్రి నవ్వేసింది. "మీరనేవి ఏమీ సరైనవి కావు. మనిషిని అర్థం చేసుకోవడానికి, అతన్ని కష్టనష్టాల నుంచి దూరం చేయటానికి బుద్ధుడు రాజ్యపరిత్యాగం చేశాడు. అంతటి త్యాగం మనం ఎలాగూ చెయ్యలేం. ఆయన్ను అర్థం చేసుకోవటానికి కూడా మనం ఇంత శ్రమించాల్సి ఉంటుంది సుమా అని గుర్తుచేసేందుకే ఇవి ఇంతదూరంలో ఉన్నాయని నా అభిప్రాయం!" అంది.

ఒక్కసారి గాయత్రికేసి చేశాను. ఎంత బాగా చెప్పింది! ఎంతగా ఆలోచించి చెప్పింది... నా భార్యే అయినా ఆమె ఇంత గొప్పదని నాకు నిజంగా ఇప్పటిదాకా తెలీదు!

ఆమాటే అన్నాను... నిజాయితీగా

గాయత్రి అన్నది నచ్చిందో, నేను గాయత్రిని మెచ్చుకోవటం నచ్చలేదో గానీ.. ఎవ్వరూ తర్వాత ఎక్కువ మాట్లాడలేదు!

....గుహల్లోని ఆ ప్రపంచంలోంచి బయటపడ్డాం!

ఆత్మారాముడు ఆవురావురుమని అంటున్నాడు. అప్పటికే బయటకొచ్చిన అందరమూ కలిసి కూర్చున్నాం. ఆడవాళ్లు బస్సులోంచి దిగి నిజమైన స్త్రీ లక్షణంతో వడ్డన ఆరంభించారు.

అదుగో అప్పుడు ఆరంభమయింది, అపశ్రుతి పలకటం.

మాకు వీళ్ళు వడ్డిస్తోంటే ఒక్కో దానిగురించి ఒక్కోవిధంగా రకరకాలుగా వ్యాఖ్యానించటం మొదలు పెట్టారు.

ఆ వ్యాఖ్యాలకు మరిన్ని జోడిస్తూ కొన్నింటికి నవ్వుకొంటూ అందరమూ తినబోతున్న క్షణంలో కడుపు దేవిరించేలా వినపడిందో పిలుపు.

"అమ్మా...."

అటుకేసి చూశాం... చింపిరి జుట్టు బవిరిగడ్డాలు... ఒళ్ళంతా నల్ల మట్టి పూసుకొన్న తీరు. ఒంట్లో అర ఔన్స్ మాంసం కూడాలేని తీరులో మొత్తం ఆరుగురు... అందరికీ వేరువేరు శరీరాలు, పేర్లూ ఉండి ఉండొచ్చుగాక, అందరూ ఒకేలా ఉన్నారు.

వాళ్ళెవరో మాకు తెలీదు. వాళ్ళు మాట్లాడే భాషా మాకు అర్థం కావడంలేదు కానీ... వాళ్ళకు ఏం కావాలో, వాళ్ళు ఏం అడుగుతున్నారో మాకు తెలుస్తూనే ఉంది.

"వెధవ జనం! అడవుల్లో కూడా వదలటంలేదు! చుక్క మంచినీళ్ళు తాగనివ్వరు... ముద్దతిండి తిననివ్వరు..."

"గరీబీ హఠావో అని గట్టిగా అరవండ్రా....! వాళ్ళు పోతారు. వాళ్ళ గరీబీ పోతుంది...!" ఎవరో అన్నారు!

అందరూ పకపక నవ్వారు.

"అలా చెప్తే పోతారా వీళ్ళు...!" అంటూ శేఖరం లేచి వాళ్ళను తిడుతూ, కొద్ది దూరం వరకు తరిమి వెనక్కు వచ్చాడు.

మళ్ళీ భోజనాలమీదకు మళ్ళింది ధ్యాస. ముద్ద కలుపుకొని, నోట పెట్టుకోబోతోంటే... హఠాత్తుగా జరిగిపోయిందా సంఘటన! ఆ ఆరుగురు బిచ్చగాళ్ళు ఒకేసారి కూడబలుక్కున్నట్లుగా నాలుగు మూలల నుంచీ వచ్చి తలో గిన్నెమీద పడ్డారు.

అందరమూ నిర్ఘాంతపోయాం!

ఆడాళ్లంతా భయపడి పారిపోయారు.

వాళ్ళు.... అందరూ... మా మొహాల్లోని ఆశ్చర్యాన్నీ కోపాన్నీ పట్టించుకోకుండా... ఒక్కోటి ఆరగిస్తున్నారు!

మాలో ముందు తేరుకున్న వాడు ఇషాక్. కళ్ళను చింతనిప్పులు చేస్తూ లేచాడు. ఆ ఆరుగురిలో ఒకడ్ని గట్టిగా పట్టుకొన్నాడు.

మామూలుగా అయితే అలాటి వాళ్ళకు ఆమడ దూరంలో నిలబడే మేం అందరమూ కూడా లేచాం. మేం లేవటంతోనే మిగిలిన బిచ్చగాళ్ళంతా పారిపోయారు.

దొరికిపోయిన ఒకడిమీద మా ప్రతాపం చూపించడం మొదలు పెట్టాం.

మేం తినబోయిన వాటిని లాగేసుకొన్నారన్న కోపం మాలోని విచక్షణను చంపేసింది. కోపంతో తలొకరు వేసిన దెబ్బతో వాడు స్పృహ తప్పే స్థితికి వచ్చేశాడు. అప్పటికి మా కోపం చల్లారింది.

వెళ్ళి దూరంగా కూర్చున్నాం.

జరిగిన సంఘటన మా అందర్నీ నివ్వెరపరచింది.

ఎవ్వరం ఏం మాట్లాడటంలేదు. జరుగుతున్నది చూస్తూ ఎందరో టూరిస్టులు దూరంగా నిలబడి ఉన్నారే తప్ప ఎవ్వరూ కల్పించుకోలేదు!

పావుగంట గడిచింది.

ఇటువైపు బస్సు నీడలో మేం. మా పక్కనే మా పిల్లాజెల్లా... మాకు కొంత దూరంలో ఏడెనిమిది గిన్నెలు అన్నం. పప్పు కూర, సాంబరు, పూరీలు...

అందరికీ ఆకలి ఉన్నా ఎవ్వరూ అటుకేసి చూడటంలేదు.

కొద్దిసేపటిక్రితం, దూరం పారిపోయిన ఆ ముష్టివాళ్ళంతా నెమ్మదిగా వచ్చారు. మేమంతా దూరంగా ఉండటంతో కొంచెం ధైర్యం పుంజుకొని, ముందుకొచ్చి, పాత కాగితాలలో, చిరిగిన బట్టల్లో ఆ గిన్నెల్లోవి కావాల్సినవి వడ్డించుకొన్నారు. మాచే దెబ్బలు

తిన్నవాడిని నెమ్మదిగా నడిపించుకొంటూ వెళ్ళారు. ఆ కాగితాలలోవి కలుపుకొని తాము తింటూ, దెబ్బలు తిన్న వాడికీ తినిపించారు.

ఎదురుగా ఆ దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయాం మేం!!

మా బస్సు క్లీనర్ మిగిలిన ఆ పదార్థాలను కూడా కొంచెం దూరంలో బండమీద ఒంపేసి కాళీగిన్నెల్ని బస్సులో పడేశాడు! బస్సు కదిలింది.

అందరిలోనూ ఆకలి.

తమ ఎదుటి తిండిని ఎవరో లాగేసుకొన్నారనే తెలీని కసి!!

బస్సు నిశ్శబ్దంగా ముందుకు పోతోంది. తోటి మనిషిని దు:ఖాన్నుంచి దూరం చేయాలనే తపనతో భార్యా బిడ్డల్ని! రాజ్యాల్ని వదిలేసిన మహామహుడి సన్నిధి నుంచి తిరిగి వస్తున్నాం. ఆకలి, వృద్ధాప్యం, మరణాలనుంచి ముక్తి ప్రసాదించాలని తపించిన తపోధనుడిని సందర్శించి వస్తున్నాం.

...ఆకలికట్టలు తెగిన ఆకలిని ఆ తర్వాత ఆపటం ఎవరికీ సాధ్యం కాదని అప్పుడు ఏం జరిగినా చుట్టూ ఉన్న ప్రపంచం నివ్వెరపోయి చూడటం తప్ప చేయగలిగేది ఏదీ లేదని తెలుసుకొని మరీ వస్తున్నాం.

ఎందుకో ఒక్కసారి నా కళ్ళముందు మాచే దెబ్బలు తిన్న వాడికి మిగిలిన వాళ్ళు అన్న తినిపిస్తున్న దృశ్యం కదలాడింది.

నాడు బోధివృక్షం కింద బుద్ధుడికి జ్ఞానోదయం ఎలా అయిందో నాకు తెలీదుగానీ నా కంటిముందు కనిపిస్తున్న ఆ అద్భుత దృశ్యంలో నాకు నిత్య సత్యాలెన్నో ఒకటొకటిగా ఆవిష్కారం కాసాగాయి.

నిజంగా.... ఈ క్షణంలోనే నాకు అజంతా గుహల్లోని ఆ కారుణ్య మూర్తి తత్వం ఏమిటో అర్థం కావటం అరంభమయింది. ఈ క్షణంలో నాకు జరుగుతున్నదే నిజమైన సాక్షాత్కారం!!

బస్సులో మిగిలిన మనుషులు ఏం ఆలోచిస్తున్నారో నాకు తెలీదు. వారి ఆకలి వారి ఆలోచనల్నీ ఎటుమళ్ళిస్తోందో నాకు తెలీదు.

నేను మాత్రం మనిషిగా ఎంతో ఎదుగుతున్నాననేది నిజం!!

– ఈనాడు, ఆదివారం సంచిక